క్లుప్తంగా

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కుమారి గ్రామ సర్పంచ్ రాజు యాదవ్ అన్నారు. మండలంలోని కుమారి గ్రామపంచాయతీలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని, వైద్యులు పరీక్షించిన అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నరేష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, వైద్య సిబ్బంది రామ్ నరేష్, సాయన్న, రాణి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సభ విజయవంతం



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు నసీర్

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఇటీవల నిర్వహించిన ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బహిరంగ సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నసీర్ అహ్మద్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సభ విజయవంతాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది'



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్

బోథ్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండ్రాళ్ల నగేశ్ పాల్గొన్నారు. పార్టీ నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలపై కార్యకర్తలు నాయకులకు అవగాహన కల్పించారు. బీజేపీని గెలిపించుకునేందుకు ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుభాష్ సూర్య, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేష్, పట్టణ అధ్యక్షులు రవితేజ, సోషల్ మీడియా కన్వీనర్ రవీందర్, కృష్ణ, శేఖర్, రంజిత్, భోజన్న పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆందోళనకు డీసీసీ అధ్యక్షుడి మద్దతు



దివ్యాంగులకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

కైలాస్‌నగర్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా రెండో రోజు కొనసాగింది. ఇందులో భాగంగా డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ మంగళవారం వారి ధర్నా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల కోసం పట్టణంలో నూతన కాలనీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రానుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. సమస్యల పరిష్కా రానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, దివ్యాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మారుతున్న నీటి తీరు

- మొన్న దిగుడుబావి.. నిన్న చేతిపంపు
- ప్రస్తుతం ఫిల్టర్ వాటర్‌పై మక్కువ
- బావి నీరే మేలంటున్న పెద్దలు



తేజాపూర్‌లో నిరుపయోగంగా బావి



ఇళ్లకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న ఫిల్టర్ వాటర్

నేరడిగొండ: కాలానికి తగినట్లు అలవాట్లు మార్చుకోవడం అనివార్యమైంది. ప్రస్తుత కాలంలో అంతుచిక్కని వ్యాధులు ప్రబలుతుంటే సామాన్యులు సైతం ఆరోగ్య విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుత కాలంలో గ్రామ గ్రామానా మినరల్ వాటర్ ప్లాంట్లు దర్శనమిస్తున్నాయి. పూర్వం తాగునీటి కోసం ప్రజలు దిగుడుబావులు, చేదుడు బావులను ఆశ్రయించేవారు. ఉదయం లేవగానే బిందెలు చేతపట్టి ఊరి చివర ఉన్న బావుల వద్దకు వెళ్లి స్వయంగా నీటిని తీసుకొని రావడం అప్పట్లో దినచర్యగా ఉండేది. ఊరి చివర బావి వద్దకు వెళ్లి రావడం, నీటిని తాడు సహాయంతో చేదడం, బిందే మోయడం ఇదే వారికి పెద్ద వ్యాయామం. అందుకే అప్పట్లో ప్రజలకు మార్నింగ్ వాక్ అంటే తెలియదు. బావుల వద్ద సంబంధ బాంధవ్యాలు పెరిగేవి. ఒకరి కష్టసుఖాలు ఒకరితో చెప్పుకునేవారు.

కాలం మారింది..

దిగుడు బావులు, చేదుడు బావులను వెక్కిరిస్తూ చేతిపంపులు వచ్చాయి. అవికూడా మంచినీటి బోర్లే కానీ బావుల మాదిరి అవి కూడా ఊరి చివర నే ఉండడంతో ప్రజలు అంత దూరం వెళ్లి బోరు నీళ్లను తెచ్చుకునేవారు. అది కూడా మంచి వ్యాయమమే. పైగా చేతిపంపు నీరు సురక్షితమైన నీరు కావడంతో ప్రజలకు అప్పట్లో వ్యాధులు ప్రబలేవి అవకాశాలు లేకపోలేదు.

ఇప్పుడంతా హైటెక్ యుగం..

కాలం ఎంతగా మారిందంటే ఈ హైటెక్ యుగంలో ప్రజలంతా ఫిల్టర్ వాటర్ వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో బావులు, చేతిపంపులకు ఆదరణ కరువైంది. ప్రస్తుతం జిల్లాలోని ఆయా మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం విచ్చలవిడిగా ఫిల్టర్ వాటర్ ప్లాంట్లు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలకు నీళ్లపై ఆందోళన అవసరం లేకుండా పోయింది. ఆటోల్లలో ఇంటి వద్దకే వచ్చి నీళ్ల క్యాన్లు డెలివరీ ఇస్తుండడంతో ప్రజలు ఫిల్టర్ వాటర్‌కు బాగా అలవాటు పడ్డారు. రానున్న రోజుల్లో తాగు నీరు కావాలంటే నొక్కండి. అవి మొబైల్‌లోనే నీళ్లను కూడా ఆర్డర్ ఇవ్వాల్సి వస్తుందేమో.

ఆ రుచే వేరు..

అప్పట్లో బావి నీరు, బోరు నీరు తాగిన ప్రజలు అమృతం లాంటి ఆ రుచిని మరిచిపోలేదు. తాగు నీరు తాగినప్పటికీ తమకు అప్పట్లో రోగాలంటే తెలియవని అప్పటితరం ప్రజలు తెలుపుతున్నారు. గడిచిపోయిన కాలంలోనే విధానం బాగుండేదని నిర్వివాదాంశం. ప్రస్తుతం ఫిల్టర్ వాటర్ తాగుతున్న వారిలో ఒళ్లు నొప్పులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. కాలం మారే కొద్దీ సమయం, పనిభారం తగ్గడం మినహా ప్రజల ఆయురారోగ్యాలు క్షీణిస్తున్నాయన్నది నాటి పెద్దల మాట. అధికారులు ఫిల్టర్ వాటర్‌ను నాణ్యతగా అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం..



అప్పట్లో మేమంతా గ్రామ శివారులో ఉన్న బావి వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకునే వాళ్లం. ఉదయాన్నే కాలినడకన బావుల వద్దకు వెళ్లి నీరు తేవడంతో వ్యాయామంతో పాటు ఆరోగ్యం కూడా బాగుండేది. ప్రస్తుతం నీరు లేక ఆ బావులన్నీ వెలవెలబోతున్నాయి. ఇప్పుడు ఫిల్టర్ వాటర్ తాగాల్సి వస్తుంది. ప్రజలు మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.

\- రాథోడ్ చంద్రబాను నాయక్, చిన్నరాజుర

పూర్తిస్థాయిలో ఫిల్టర్ చేయకపోవడంతోనే..



ప్రస్తుతం ఫిల్టర్ వాటర్ వాడకం బాగా పెరిగిపోయింది. అయితే ప్లాంట్లలో పూర్తి స్థాయిలో నీళ్ల ఫిల్టర్ చేయడం సాధ్యం కాదు. ఫలితంగా ఆ నీరు తాగిన వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలకు ఫిల్టర్ వాటర్ మినహా మరే ప్రయత్నం లేదు. ఫిల్టర్ వాటర్ అందుబాటులో లేని వారు కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలి.

\- డాక్టర్ రాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి, నేరడిగొండ

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న భక్తులు

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలోని కోదండ రామాలయంలో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్టాపన చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, తెలంగాణ రాష్ట్ర అధ్యాపకులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతం రెడ్డి, ఇచ్చోడ ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చందర్‌ను కలిసిన నేతకాని మహర్ నేతలు

ఎదులాపురం: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను ఆదిలాబాద్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, నేతకాని మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రామగుండంలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లిన ఆయన బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యేను కలిసి పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో దుర్గం ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. సామాజిక కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న దుర్గంశేఖర్‌ను ఎమ్మెల్యే చందర్ ప్రత్యేకంగా అభినందించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం



నియామక పత్రాలు అందిస్తున్న జోగు ప్రేమేందర్, డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 32మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినందుకు మంగళవారం వైద్య ప్రజారోగ్య ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు సర్వీస్ రెగ్యులర్ పత్రాలను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేస్తూ వారి ఏళ్ల నాటి కలలు సాకారం చేశారన్నారు. ఉద్యోగస్తులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు నిరంతరం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ గుర్తింపు పొందాలను ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఐవో వైసీ శ్రీనివాస్, డీఎంఓ శ్రీధర్, వైద్య ప్రజారోగ్య ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సునీత

ఇచ్చోడ: పంచాయతీ అభివృద్ధికి వార్డుసభ్యులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులుసహకరించాలని ఇచ్చోడ మేజర్ పంచాయతీ సర్పంచ్ చౌహాన్‌సునీత అన్నారు. మంగళవారం నిర్వహించిన పంచాయతీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ కాలనీలో మురుగుకాల్వలు శుభ్రం చేయాలని తీర్మాణించారు. పారిశుధ్య కార్మికులకు ప్రతీ నెలా జీతాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు కోరారు. వర్షాకాలంలో లోతట్టు కాలనీలో వరద నీరు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇస్లాంపూర్ కల్వర్టు వద్ద అక్రమంగా నిర్మించిన డ్రయినేజీని తొలగించాలని సభ్యులు డిమాండ్ చేశారు. పలు కాలనీలో చెడిపోయిన బోరుబావులకు మరమ్మతులు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ జాహెద్, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, జూనియర్ అసిస్టెంట్ వెంకన్న, పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



నివేదిక చదువుతున్న అధికారి

సిరికొండ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పెందోర్ అమృత్ రావ్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మండల వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వ్యవసాయ శాఖ మండల అధికారి మాట్లాడుతూ విత్తన సమయంలో ఏదైన సమస్యలు ప్రజలు సర్పంచ్‌ల దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యల నివృత్తికి తమ శాఖ అధికారులు పరిష్కరిస్తారని అన్నారు. దళారులు విక్రయించే నకిలీ విత్తనాలు, ఎరువులకు రైతులు దూరంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఏమైన సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో సురేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా శబరిమాత విగ్రహ ఊరేగింపు



శబరిమాతా విగ్రహ ఊరేగింపులో భక్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నేరడిగొండ: మండల కేంద్రంలో శబరి మాత విగ్రహ ప్రతిష్ఠపాన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణాల నడుమ భక్తులు ఊరేగింపు నిర్వహించారు. కాగా మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి రోజు శబరి మాత విగ్రహ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. శబరిమాత ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొన్నారు. శబరి మాతాజీ విగ్రహ ఊరేగింపు, పూజలు, హోమం, జలాధి వాసము, కలశ జలములచే పూజలు నిర్వహించారు. యజ్ఞ నిర్వాహకులు ఎల్కుచి రమేష్ పంతులు, శ్రవణ్‌కుమార్ జోషి బృందంచే పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెంట వెంకట రమణ, భక్తులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాపురావు, సభ్యులు

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో జూన్ 2న నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును మంగళవారం విగ్రహ ఆవిష్కరణ కమిటీ కలిసి ఆహ్వానించింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్ కమిటీ సభ్యులు విష్ణు, విశాల్‌లు మాట్లాడుతూ జూన్ 2న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని, 4న రాజసింగ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. వారితో పాటు సర్పంచ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ ఉన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



పిప్పల్‌కోటిలో జెండా ఆవిష్కరిస్తున్న వెంకటమ్మ

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిప్పల్‌కోటిలో అంగన్‌వాడీ టీచర్ల జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ సీఐటీయూ మండల నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటమ్మ మాట్లాడుతూ కార్మికులు, వివిధ వర్గాల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్వామి, రాజు ఉన్నారు.

గురుకులంలో సీటు సాధించడం అభినందనీయం



విద్యార్థులతో మాట్లాడుతున్న స్కూల్ ప్రత్యేకాధికారి ప్రశాంత్‌రెడ్డి

ఎదులాపురం: మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన డ్రాప్ అవుట్ బాలురు తెలంగాణ గురుకులం మొదటి విడతలోనే సీట్లు సాధించడం ఆనందంగా ఉందని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రత్యేక అధికారి ప్రశాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం వారిని ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. బజార్‌హత్నూర్ మండలం గిరిజాయి గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాస్, టి.పవన్‌కుమార్, కే.రవితేజ, రేణిగూడ గ్రామానికి చెందిన పి.నితిన్, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఎం.గజానంద్ అనే విద్యార్థులు ఐదో తరగతిలో సీట్లు సాధించారని వివరించారు. సిబ్బంది కృషితో అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో డ్రాప్ అవుట్లుగా చేరిన విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. డ్రాప్ అవుట్ నిరుపేద, అనాథ, బాలల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యూఆర్‌ఎస్‌ల్లో అర్హులైన బాలలను చేర్పించాలని కోరారు.

రోగుల ఇబ్బందులు తీర్చాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని డీసీసీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిని మంగళవారం సందర్శించిన ఆయన రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం రోగులు పడుతున్న ఇబ్బందులపై రిమ్స్ డైరెక్టర్‌ను కలిసి వెల్లడించారు. ఆయన కాంగ్రెస్ నాయకులు సెద్మకి ఆనంద్, తదితరులు ఉన్నారు.